క్లుప్తంగా

ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం



శిక్షణలో పాల్గొన్న ఏపీ, తెలంగాణా ఎన్‌సీసీ క్యాడెట్లు

విజయనగరం క్రైమ్: విజయనగరం ఎమ్ఆర్ కళాశాల బాయ్స్‌హాస్టల్ వద్ద ఎన్‌సీసీ ఆర్మీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ తపస్ మండల్ ఆధ్వర్యంలో వార్షిక శిక్షణ శిబిరం బుధవారం ప్రారంభమైంది. పదిరోజుల పాటు నిర్వహించే శిక్షణకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని వివిధ పాఠశాలల, కళాశాలల ఎన్‌సీసీ క్యాడెట్స్ 400 మంది హాజరయ్యారు. దేశ నిర్మాణంలో ఎన్‌సీసీ క్యాడెట్ల భాగస్వామ్యం, లౌకిక దృక్పథం, విధులు పట్ల అవగాహన, నిస్వార్థత, భక్తి, సాహసస్ఫూర్తి తదితర వాటిపై శిక్షణ ఇస్తున్నారు. వివిధ రకాల ఆట పాటలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

కొబ్బరి ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధి

పూసపాటిరేగ : కొబ్బరి ఉత్పత్తులతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని కొబ్బరి రైతుల సంఘ జిల్లా అధ్యక్షుడు మొంగం శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీలో బోర్డు డైరెక్టర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మార్కెట్‌లో కొబ్బరి ఉత్పత్తులను ప్రమోట్ చేయాలన్నారు. రైతుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొబ్బరి రైతులకు రాయితీపై ఎరువులు అందజేస్తామని తెలిపారు. నాణ్యమైన కొబ్బరి నారు, కొబ్బరి నీరు, కొబ్బరి చెక్కలు, కొబ్బరి లడ్డూలు రైతుల ద్వారా మార్కెట్ ధర కంటే తక్కువకే విక్రయిస్తామన్నారు. కార్యక్రమంలో కంపెనీ చైర్మెన్ ఎరకయ్యదొర, డైరెక్టర్లు మొంగం నాగబాబు, రౌతు సాయికుమార్, పబ్బిరెడ్డి అప్పడుదొరతో పాటు పలువురు పాల్గొన్నారు.

అన్నదానం

డెంకాడ: వినాయక ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గొలగాం గ్రామంలో బుధవారం అన్నసమారాధన జరిగింది. సర్పంచ్ బూర్లె అప్పలనాయుడు స్వామివారి ప్రసాదాన్ని వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వందలాది మంది భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

మోదీ విధానాలను ప్రతిఘటిద్దాం



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న సీఐటీయూ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రధాని మోదీ విధానాలను ప్రతిఘటించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. శ్రీనివాస పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 117వ జయంతిని సీఐటీయూ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్, ఎ. జగన్ మోహనరావు, పార్టీ నాయకులు బి. రమణ, పైడిరాజు, త్రినాథ్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన తప్పనిసరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపరింటిండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక సర్వజన ఆస్పత్రిలో అవయవదానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, అవయవదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటిండెంట్లు డాక్టర్ పీఏ. రమణి, డాక్టర్ బొత్స సంతోష్, ఆర్ఎంఓ పి. సురేష్‌కుమార్, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై నారాయణరావు

నెల్లిమర్ల: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై పి. నారాయణరావు అన్నారు. బుధవారం స్థానిక సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్‌కి బానిసలైనవారు విచక్షణ కోల్పోయి నేరాలకు పాల్పడతారన్నారు. సైబర్‌నేరాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య భాగ్యం

- 30 నుంచి ప్రజల చెంతకు ఆరోగ్య సేవలు
- విజయనగరం కార్పొరేషన్ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాచరణ సిద్ధం
- 12 రోజుల పాటు 61 సచివాలయాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు
- ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసిన వలంటీర్లు
- ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు



వార్డుల్లో ఇంటింటికి వెళ్లి వైద్యాధికారి సమక్షంలో రక్త నమూనాలు పరీక్షిస్తున్న ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు

విజయనగరం: పాలనలో నూతన సంస్కరణలతో ప్రజలకు చేరువవుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే సత్సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట వినూత్న కార్యక్రమం అమలు చేస్తున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్థానికంగా వైద్య శిబిరాలు నిర్వహించడం అందరికీ తెలిసిన విషయమే.. అయితే నేరుగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాలు, వార్డుల వారీగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వివిధ రకాల రోగాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అధికార యంత్రాంగం ఇప్పటికే కార్యక్రమాన్ని ప్రారంభించగా... ఈనెల 30 నుంచి కార్పొరేషన్ పరిధిలో గల 61 సచివాలయాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది.

నాలుగు దశల్లో ఆరోగ్య సురక్ష..

తొలిదశలో వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు ఈ ముగ్గురూ కలిసి ప్రతి ఇంటినీ సందర్శించారు. ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించే తేదీతో పాటు ఏయే కార్యక్రమాలు చేపడతామో వివరించారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్న ఆస్పత్రుల వివరాలు, పథకాన్ని ఎలా వినియోగించుకోవాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. తర్వాత దశలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఏరియా వలంటీర్లతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ఏడు రకాల పరీక్షలకు సంబంధించిన వివరాలను ప్రజలకు వివరిస్తారు. బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, యూరిన్ టెస్టుతో పాటు స్పూటమ్, మలేరియా, డెంగీ పరీక్షలను ప్రస్తుతం నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఈ పరీక్షలు నిర్వహిస్తూ వివరాలను మొబైల్ యాప్‌లో అప్‌డేట్ చేస్తున్నారు. ప్రతి ఇంటికీ, పేషెంట్‌కి ఒక కేస్‌షీట్ కూడా జనరేట్ అవుతుంది. మూడో దశలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించే తేదీ, వేదికలను మరోసారి వలంటీర్, ఏఎన్ఎం, ప్రజా ప్రతినిధులు తెలియజేస్తారు. నాలుగో దశలో వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.



బీపీ పరీక్షిస్తున్న సిబ్బంది

ప్రతి ఇంటినీ కవర్ చేసేలా కార్యక్రమం

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలను ప్రభుత్వం తెలుసుకుంటుంది. వారికి అవసరమైన మందులు, కళ్లద్దాలు, తదితరాలు అందిస్తారు. వైద్య శిబిరం నిర్వహించే ప్రాంతాన్ని మ్యాపింగ్ చేసి, ఏ సమస్యలున్నాయన్నదీ తెలుసుకుని ఫ్యామిలీ డాక్టర్ విలేజ్ క్లినిక్ ద్వారా వాటిని పరిష్కరిస్తారు.

విజయనగరం కార్పొరేషన్ పరిధిలో వైద్య శిబిరాల షెడ్యూల్..

తేదీ	వేదిక	సచివాలయాలు
30.09.23	యూపీహెచ్‌సీ, వినాయకనగర్	27, 29, 57, 58, 59
4.10.23	యూపీహెచ్‌సీ,, పూల్‌బాగ్‌కాలనీ	1, 2, 3, 4, 5
6.10.23	యూపీహెచ్‌సీ, రాజీవ్‌నగర్ కాలనీ	8, 9, 10, 33, 34
7.10.23	యూపీహెచ్‌సీ, వీటీ అగ్రహారం	42, 43, 44, 45, 46
10.10.23	యూపీహెచ్‌సీ, అరుంధతీనగర్	47, 48, 49, 50, 52
11.10.23	55వ సచివాలయం, కేఎల్‌పురం	51, 53, 54, 55, 56
13.10.23	32వ సచివాలయం, ఆనందపేట	31, 32, 35, 36, 37
16.10.23	ఉల్లివీధి ప్రభుత్వ ఉన్నత పాఠశాల	6, 7, 11, 12, 13
17.10.23	యూపీహెచ్‌సీ, జొన్నగుడ్డి	30, 38, 39, 40, 41
18.10.23	కంచర్ల మున్సిపల్ స్కూల్	14, 15, 19, 20, 28, 61
20-10	యూపీహెచ్‌సీ, లంకాపట్నం	21, 23, 24, 25, 26
21-10	యూపీహెచ్‌సీ, సంతపేట	16, 17, 18, 22, 60

సద్వినియోగం చేసుకోవాలి..



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కార్పొరేషన్ పరిధిలోని ప్రతి కుటుంబ సభ్యుడి వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు వారికి ఏడు రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. పరీక్షల్లో వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్యులతో తనిఖీలు చేపట్టి అవసరమైన వారికి మందులు పంపిణీ చేయనున్నాం. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– రెడ్డి.శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమ్మన్నశెట్టి

జయనగరం: అన్ని వర్గాల ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల తమ్మన్నశెట్టి అన్నారు. నగరంలోని 41వ డివిజన్ పరకాలవీధి మసీద్ నుంచి బుధవారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎస్.నారాయణస్వామితో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి కుటుంబానికీ కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. కార్పొరేటర్ ఎస్.నారాయణస్వామి, కోఆప్షన్ సభ్యుడు రహీమ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాలన, సంక్షేమ పథకాలపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే ప్రభుత్వ పథకాల నగదు జమవుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ దూబే, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా

- ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: జగనన్న సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా కలుగుతోందని ఎంపీడీఓ ఎం. రాధిక అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 16వ తేదీ నుంచి మండల పరిధిలో ఆరోగ్య సర్వే జరుగుతోందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి బీపీ, సుగర్, జ్వరాలు, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఆర్‌పీఎస్, యూరిన్, తదితర ఏడు రకాలు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 30 వ తేదీ నుంచి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారందరికీ వైద్య సేవలు అందిస్తారన్నారు. వైద్యాధికారి రాజేష్‌వర్మ మాట్లాడుతూ, ఈనెల 30వ తేదీ నుంచి ఏర్పాటు చేయబోయే ఆరోగ్య శిబిరాలకు కావాల్సిన వసతితో పాటు ఆయా గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, వైద్యాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

రక్తదాన శిబిరాలు నిర్వహించాలి..

విజయనగరం ఫోర్ట్: ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా రక్తనిధి కేంద్రాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి భాస్కరరావు అన్నారు. బుధవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లాలో ఉన్న 8 రక్తనిధి కేంద్రాల నిర్వాహకులతో ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ రెండో వరకు స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఈ నెల 29న సామాజిక ఆరోగ్య కేంద్రాలలో (చీపురుపల్లి, బొబ్బిలి, బాడంగి, భోగాపురం, గజపతినగరం) ప్రభుత్వ రక్తనిధి కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు వైద్యారోగ్య శాఖ నిర్వహిస్తుందని చెప్పారు. రక్తదానంపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

రోగులకు సకాలంలో వైద్యసేవలు



ఫార్మసీ విభాగంలో మందులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: రోగులకు సకాలంలో వైద్యసేవలందించాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు అన్నారు. స్థానిక సర్వజన ఆస్పత్రిలో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఓపీ విభాగాలు, వార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఎక్స్‌రే, స్కానింగ్, ఫార్మసీ విభాగాలను పరిశీలించారు. ఫార్మసీ విభాగం వద్ద అధిక సంఖ్యల రోగులు ఉండడంతో ఎక్కువ సేపు రోగులు నిరీక్షించకుండా చర్యలు తీసుకోవాలని ఫార్మసిస్టులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స కోసం వచ్చే వారికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసి శస్త్రచికిత్సలు త్వరగా అయ్యేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ పి.సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'ఉప్పాడ'కు అభినందనలు

భోగాపురం: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఉప్పాడ సూర్యనారాయణరెడ్డిని మండలంలోని కవులవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఉప్పాడపేట పార్టీ కార్యాలయంలో కలిసి అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొండపు కొత్తయ్యరెడ్డి, కోరాడ అప్పన్న, వైస్ సర్పంచ్ దువ్వ సూరినాయుడు, వార్డు నంబర్లు దువ్వ రాము, శ్రీను, గురువులు, కొండపు నాగరాజు, నాగ కొత్తయ్య, అప్పన్న, కొయ్య రామారావు, లక్ష్మణ, సోము ముత్యాలు, సీహెచ్ నరసింగరావు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

పూసపాటిరేగ: మండలంలోని ఎరుకొండ గ్రామ సమీపంలో కొండకు ఆనుకుని ఉన్న ఆక్రమణలను తొలగించాలని సర్పంచ్ జి.అప్పలస్వామి కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఈ. భాస్కరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామానికి చెందిన కొందరిపైనే రెవెన్యూ అధికారులు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయనతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు

విజయనగరం: ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అధికారులతో పాటు కార్పొరేషన్ పాలకవర్గం కృషి చేస్తోందని మెటీరియల్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మెటీరియల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య విభాగానికి సంబంధించి రూ.32 లక్షలతో కొనుగోలు చేయనున్న వివిధ రకాల పరికరాల నాణ్యతతో పాటు ధరలను పరిశీలించారు. ముఖ్యంగా చెత్త తరలించే వాహనాలకు అవసరమైన డబ్బాలు, చీపుర్లు, గడ్డపారలు.. పారిశుధ్య సిబ్బందికి అవసరమైన దుస్తులు, తదితర పరికరాల నమూనాలను కమిటీ పరిశీలించింది. ఈ సందర్భంగా మెటీరియల్ కమిటీ సభ్యుడు గుజ్జల నారాయణరావు మాట్లాడుతూ.. పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సదుపాయాల కల్పన కోసం వివిధ విభాగాల కమిటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో ఏర్పాటయ్యాయన్నారు. ప్రజారోగ్య విభాగం నుంచి కొనుగోలు చేయతలపెట్టిన పరికరాల విషయమై నిశితంగా పరిశీలించామన్నారు. మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ నాయకుడు రంగరాజు మాట్లాడుతూ.. కొనుగోలు చేస్తున్న పరికరాలు, పనిముట్ల నాణ్యతను పరిశీలించడం హర్షించదగ్గ పరిణామమన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నడిపిల్లి ఆదినారాయణ, చందక శ్రీనివాసరావు, కామేష్, రమేష్ రాజు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



అగ్నిమాపక నివారణ పద్ధతులను డెమో ద్వారా వివరిస్తున్న సోమేశ్వరరావు

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

విజయనగరం క్రైమ్: ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు, స్పందన, అగ్నిమాపక సేవల శాఖ డైరెక్టర్ జనరల్ ఆదేశాలతో జిల్లా కేంద్రంలో వివిధద విద్యాసంస్థలు, షాపింగ్ మాల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో సెక్యూరిటీ గార్డులు, మాల్ సిబ్బందికి వివిధ రకాల అగ్ని ప్రమాదాలకు గల కారణాలు తెలిపి, వాటిని అదుపు చేసే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు సంతోష్, ఎంపి నాయుడు, బీపీ కుమార్, మురళీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి..



ధర్నా చేస్తున్న వామపక్షాలు నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ప్రజలపై కేంద్ర ప్రభుత్వం వేసిన విద్యుత్ చార్జీల భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రోజు రోజుకీ విద్యుత్ ధరలు పెంచుతూ పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం మోపారన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి పెంచిన ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒమ్మి రమణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ , సీపీఎం నాయకులు రెడ్డి శంకరరావు, పి. రమణమ్మ, జగన్‌మోహన్, నగర కార్యదర్శి బి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.02 కోట్లతో మరో బీటీ రోడ్డు

- పనులు పరిశీలించిన కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



అంబేడ్కర్ జంక్షన్ నుంచి గంటస్తంభం వరకు వేసిన బీటీ రోడ్డు

విజయనగరం: నగర అభివృద్ధే ధ్యేయంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రధాన మార్గమైన అంబేడ్కర్ జంక్షన్ నుంచి గంటస్తంభం జంక్షన్ వరకు నిర్మించిన బీటీ రోడ్డు పనులు బుధవారంతో పూర్తయ్యాయి. రూ.1.02 కోట్లతో సుమారు 600 మీటర్ల పొడవున రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. గతంలో మాదిరిగా కాకుండా రోడ్డుకు ఇరువైపులా చివరిభాగం వరకు రోడ్డు నిర్మించారు. ఇదిలా ఉండగా రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు పరిశీలించారు. మురుగునీరు, వర్షపు నీటికి అడ్డంకి లేకుండా కాలువలను పూర్తి ప్రమాణాలతో నిర్మించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఈఈ శ్రీనివాసరావు, డీఈలు పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

డెంకాడ: మండలంలో ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ స్వరూపారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డెంకాడ, మోపాడ పీహెచ్‌సీల డాక్టర్లు పావని, నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 30న పినతాడివాడలో.. వచ్చే నెల 3న మోదవలస.. 4న సింగవరం.. 5న బొడ్డవలస.. 6న గుణుపూరుపేట.. 7న చింతలవలస.. 9న చొల్లంగిపేట.. 10న రఘుమండ.. 11న పెదతాడివాడ.. 12న అమకాం..13న అక్కివరం.. 16న జొన్నాడ.. 17 గంట్లాం.. 18 చింతలవలస-2.. 19న బంటుపల్లి గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తారన్నారు.

అమకాంలో..

అమకాం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం చేపట్టిన సర్వేను ఎంపీడీఓ స్వరూపారాణి పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కేంద్ర నిర్వహణ, రిజిస్టర్ల నిర్వహణగా పక్కాగా చేయాలని సూచించారు.



అమకాంలో చేపట్టిన సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ స్వరూపారాణి

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం...



సాంస్కృతిక ప్రదర్శన బృందంతో యూనివర్సిటీ అధ్యాపకులు

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో టూరిజం అండ్ హాస్పిటాలిటీ విభాగం నిర్వహణలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ, దేశ అభివృద్ధిలో పర్యాటక రంగం కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్‌బీ కివాడే మాట్లాడుతూ, టూరిజం పరిశ్రమ అందిస్తున్న అపారమైన ఔత్సాహిక అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ ప్రొఫెసర్ జితేంద్రమోహన్ మిశ్రా, యూనివర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.